సాక్షి
తిరుపతి
మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



ఈవీఎం గోడౌన్ల తనిఖీ

రేణిగుంటలోని ఈవీఎంల గోడౌన్‌ను కలెక్టర్ వెంకేశ్వర్లు సోమవారం అఖిల పక్ష నాయకులతో కలిసి తనిఖీ చేశారు. - 8లో



అర్జీదారుల మొర వినండి!

ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అర్జీదారుల సమస్యలను విని పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. - 8లో

శ్రీహరి ఇలను చేరి!



తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారు హనుమంత, గజ వాహనాలపై ఊరేగారు. - 8లో

వైభవోత్సవం

- హనుమంత, స్వర్ణరథం, గజవాహనంపై అభయం



స్వర్ణరథంలో మలయప్ప స్వామి



పవన సుతుడిపై పరంధాముడు



గజవాహనంపై శ్రీవారు

బ్రహ్మాండ నాయకుడు శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువలా సాగుతున్నాయి. సోమవారం ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం స్వర్ణరథం, రాత్రి గజవాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. దేవదేవుని దివ్యమంగళరూపాన్ని దర్శించుకున్న భక్తులు దివ్యానుభూతిని పొందారు. వాహన సేవల్లో కళాకారుల నృత్యాలు, కోలాటాలు, భజన బృందాల సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ పాల్గొన్నారు. - తిరుమల





కళాకారులు నాట్య విన్యాసం



వాహన సేవలో దేవతామూర్తుల వేషధారణ



హనుమంత వాహన సేవలో వేదపారాయణం



గజవాహన సేవలో కళాకారుల నృత్య ప్రదర్శన

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూ కృష్ణ తేజ అతిథి గృహం వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 79,496 మంది స్వామివారిని దర్శించుకున్నారు 29,591 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.79 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారు 3 గంటల్లో తిరుమలేశుని దర్శించుకోగలగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలైన్‌లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

సీడీసీఏ నూతన కార్యవర్గం ఎన్నిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలో ఆదివారం జరిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. సీడీసీఏ అధ్యక్ష, కార్యదర్శులుగా టి.శ్రీనివాసమూర్తి, మందపాటి సతీష్ యాదవ్, కోశాధికారిగా సీజే శివప్రసాద్, ఉపాధ్యక్షునిగా శ్రీధర్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా కోలా హరి ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా వై.మురళీయాదవ్, ఎస్.రవి, డి.వెంకటరమణ, జి.దివాకర్, బి.రాజేంద్ర, ప్రసాద్‌శర్మ, జె.మార్కండేయులు, కె.ప్రకాష్ నాయుడు, ఎస్.ఖాదర్‌బాషా, పీకె.సత్యశ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆటోనగర్ స్థలాలపై 22ఏ ఎత్తివేత

తిరుపతి అర్బన్: నగరంలోని ఆటోనగర్ ప్రాంతానికి చెందిన స్థలాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 22ఏ నిషేధాన్ని ఎత్తి వేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) 1997లో 18.25 ఎకరాల్లో 338 స్థలాలు అభివృద్ధి చేసి, వీటిలో 337 స్థలాలు ఆటోమొబైల్ యూనిట్లకు కేటాయించారని చెప్పారు. ప్రస్తుతం ఒక స్థలం కూడా ఖాళీ లేదన్నారు. అయితే 2018 నుంచి తిరుపతి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్కరంపల్లె గ్రామం సర్వే నంబర్ 74-7, మంగళం గ్రామం సర్వే నంబర్ 95-2 నిషేధిత జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని చెప్పారు. ఈ క్రమంలో రెవెన్యూ సదస్సుల్లో అనేక మంది చేసిన విజ్ఞప్తులను పరిశీలించి, సమీక్ష అనంతరం వాటిని 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నట్లు స్పష్టం చేశారు. దీంతో 337 ఆటోమొబైల్ యూనిట్లు నేరుగా లబ్ధిపొందాయని చెప్పారు. అలాగే 1,500 మంది కార్మికులకు పరోక్షంగా ఉద్యోగ భద్రత లభిస్తుందని తెలిపారు.

పల్లె వైద్యంపై సమ్మెట

వైద్యులకిచ్చిన హామీలు నెరవేర్చని కూటమి సర్కారు..వైద్యరంగంపై నిర్లక్ష్యం.. అరకొర మందులు..నిర్వీర్యమైన పీహెచ్‌సీలు..వెరసి..పల్లె వైద్యం పడకేసింది. శతకోటి సమస్యల నడుమ డాక్టర్లకు సవాలుగా మారిన విధి నిర్వహణ.. ఫలితం వైద్యులు సమ్మెబాట పట్టారు. అత్యవసర సేవలు మినహా అన్ని ఆగాయి. దీంతో గ్రామీణులు చికిత్స అందక ఇక్కట్లు పడ్డారు.

వైద్య రంగానికి 'చంద్ర'గ్రహణం

- సమస్యల పరిష్కారం కోసం సమ్మెలో వైద్యులు
- పలు చోట్ల ఓపీ సేవలు బంద్
- 104 వైద్య సేవలపై ప్రభావం
- ఆన్‌లైన్ సేవలు నిలుపుదల
- ప్రజలకు తప్పని అవస్థలు



గూడూరు మండలం పీహెచ్‌సీలో రోగులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న ఆస్పత్రి

తిరుపతి తుడా: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పల్లె వైద్యాన్ని పట్టించుకోకపోవడంతో పేద రోగులు అష్టకష్టాలు పడుతున్నారు. అరకొర వైద్యం.. చాలీచాలని మందులతో ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వీర్యం దిశగా పయనిస్తున్నాయి. పల్లె వైద్యానికి చంద్రగ్రహణం పట్టుకుంది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 58 పీహెచ్‌సీల వైద్యులు సమ్మెబాట పట్టారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎంతకీ ప్రభుత్వం స్పందించకపోవడంతో పీహెచ్‌సీ వైద్యులు సమ్మె చేట్టారు. జిల్లాలోని పలు పీహెచ్‌సీ సోమవారం నుంచి ఓపీ సేవలు నిలిపివేశారు. అత్యవసర సేవలు మాత్రం అక్కడక్కడ కొనసాగాయి. నల్లరిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. ఆన్‌లైన్ సేవలు, రిపోర్టుల సమర్పణకు బంద్ పాటించారు. దీంతో పలు సేవలు స్తంభించాయి. పలుచోట్ల ప్రజలు చికిత్స అందక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వచ్చింది. ప్రభుత్వం నిరంకుశ వైఖరి వీడి, న్యాయపరమైన తమ డిమాండ్లు నెరవేర్చకపోతే పూర్తి స్థాయిలో విధుల బహిష్కరణకు సైతం వెనుకాడేది లేదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అత్యవసర సేవలను కొనసాగించారు. సమ్మె ప్రభావంతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. సమ్మె విషయం ప్రజల్లోకి చేరడంతో చాలా మంది పీహెచ్‌సీలకు రాకుండా పట్టణం బాట పట్టారు. దీంతో పీహెచ్‌సీలు వెలవెలపోయాయి.

దాక్టర్ల డిమాండ్‌లివీ..

సర్వీస్‌లో ఉన్న మెడికల్ ఆఫీసర్లకు గతంలో 30 శాతం క్లినికల్, 50 శాతం నాన్ క్లినికల్ రిజర్వేషన్ ఉండేది. ప్రభుత్వం జీఓ నంబర్ 85 ద్వారా ఈ కోటాను 15.30 శాతానికి కుదించేసింది. ఈ ఏడాది జీఓ నంబర్ 99 ద్వారా ఆరు బ్రాంచ్‌ల నిబంధన తెర మీదికి తెచ్చారు. దీని ప్రకారం, 15 శాతానికి కుదించిన క్లినికల్ సీట్ల రిజర్వేషన్ రేడియాలజీ, మెడిసిన్, సర్జరీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ, అనస్థీషియా బ్రాంచ్‌లకు మాత్రమే వర్తింపజేసింది. ఈ అన్యాయాన్ని వైద్యులు ఏడాది కాలంగా ప్రశ్నిస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదు. ఎంబీబీఎస్ చదివి వైద్యాధికారిగా నియమితులైన వారు పీజీ చదువుకోవడానికి ప్రభుత్వం అనేక షరతులు పెట్టింది. రూ.50 లక్షల ష్యూరిటీ ఇవ్వాలని, కనీసం పదేళ్ల ప్రభుత్వ సర్వీసులో అదే హోదాలో పని చేస్తామంటూ బాండ్ రాయాలని చెబుతోంది. అదీ కాక మెడిసిన్ చదివిన ఒరిజినల్ సర్టిఫికెట్లు కూడా ప్రభుత్వం తన వద్ద హామీగా పెట్టుకుంటోంది. వైద్యవృత్తిలో ఎదుగుదల లేదంటే పీజీ చదవడం దేనికని పీహెచ్‌సీల వైద్యులు ప్రశ్నిస్తున్నారు. ఈ నిబంధనలు సడలించాలని కోరుతున్నా ప్రభుత్వం మనసు కరగడం లేదు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో పనిచేస్తున్న ఎంతో వైద్యాధికారులకు 20 ఏళ్లుగా ప దోన్నతులు లేవు. వారికి పదోన్నతులిస్తామని ఎన్నికల వేళ అసోసియేషన్ నాయకులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఇప్పుడు ఆ విషయం ప్రస్తావిస్తే కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటోందని వైద్యులు చెబుతున్నారు. కోవిడ్ వేళ అత్యవసర పరిస్థితిలో చేరి, ప్రాణాలకు తెగించి మరీ రోగులకు వైద్య సేవలు అందించిన తమపై కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని వైద్యు లు చెబుతున్నారు. 2020-22 మధ్య ఉద్యోగంలో చేరిన వైద్యులకు ఇప్పటికీ రూ.53,500 మాత్రమే జీ తం ఇస్తున్నారు. 2023లో నియమితులైన ఫ్రెషర్లకు రూ.80 వేల నుంచి రూ.90 వేల పే స్కేల్ అమలు చేస్తున్నారు. తమ జీతాలను తాజా పే స్కేల్‌లో సమానం చేసి, పెండింగ్ జీతాన్ని నోషనల్ ఇంక్రిమెంట్ల కింద చెల్లించాలని కోరుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గత ఏడాది ఇదే నెలలో వైద్యులు రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరిస్తామని అప్పట్లో కూటమి నేతలు, అధికారులు చెప్పారు. తీరా నిరసన విరమించాక ఏమాత్రం పట్టించుకోలేదు. చంద్రన్న సంచార చికిత్స వాహనంలో తిరిగి సేవలందిస్తున్నందుకు ప్రతి నెలా అదనంగా రూ.5 వేలు చెల్లించాలని కోరుతున్నారు.

ఆందోళన కార్యక్రమం ఇలా..

ఆంధ్రప్రదేశ్ పీహెచ్‌సీ వైద్యుల సంఘం (ఏపీపీహెచ్‌సీడీఏ) పిలుపు మేరకు వైద్యులు సమ్మె బాట పట్టారు. దీనిని దశల వారీగా నిర్వహించనున్నట్లు సంఘం నేతలు శిరీష, చంద్రమహేష్ తెలిపారు. ఇందులో భాగంగా రెండు రోజులుగా నల్ల రిబ్బన్లతో వైద్యులు నిరసన ఉంటుందన్నారు. మంగళవారం జిల్లా కేంద్రాల్లో నిరసన తెలుపు తామన్నారు. వచ్చే నెల ఒకటిన ప్లకార్డులతో జిల్లా కేంద్రంలో ర్యాలీ, ధర్నా నిర్వహిస్తామన్నారు. 2న విజయవాడకు దీక్ష యాత్ర చేస్తామన్నారు. 3న నిరాహార దీక్షలు చేపడతామన్నారు. ఇన్ సర్వీస్ పీజీ కోటా సహా తమ సమస్యలన్నీ తక్షణమే పరిష్కరించాలనే డిమాండ్‌తో ఉద్యమిస్తామని వారు పేర్కొన్నారు.



నాగలాపురం పీహెచ్‌సీలో ఖాళీగా దర్శన మిస్తున్న వైద్యాధికారుల గది



వెలవెల పోతున్న వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం పీహెచ్‌సీ

బుచ్చినాయుడు కండ్రిగలో వైద్య సేవలు బంద్

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక పీహెచ్‌సీలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ప్రభుత్వ వైద్యులు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేశారు. వైద్యులు మురళీధర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ సమ్మెలోకి వెళ్లడంతో ఓపీ సేవలు బంద్ అయ్యాయి. దీంతో రోగులు ఇబ్బంది పడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్ సర్వీసు కోటాను పునరుద్ధరించాలని, టైమ్-బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50 శాతం ట్రైబల్ అలవెన్స్ ఇవ్వాలని, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రామ్ కింద వైద్యులకు రూ.5 వేలు అలవెన్స్ ఇవ్వాలని, నేటివిటీ, అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌సీ వైద్యులకు కచ్చితమైన పని గంటలు, స్థిరమైన వారాంతపు సెలవులు ఇవ్వాలని, వైద్యులకు జాబ్ చార్ట్ ఇవ్వాలని తెలిపారు. వైద్యులకు పదోన్నతులు కల్పించాలన్నారు. వైద్యుల సమస్యలను పరిష్కరించకుంటు దశల వారీగా అత్యవసర సేవలను కూడా ఆపేస్తామని హెచ్చరించారు.

వైద్యం అందలేదు

గాజులపెళ్లూరు గ్రామానికి చెందిన నేను అనారోగ్య సమస్యతో వైద్యం కోసం బుచ్చినాయుడుకండ్రిగలోని ప్రాథమిక కేంద్రానికి సోమవారం వచ్చాను. అయితే వైద్యులు సమ్మెలో ఉన్న కారణంగా వారు విధులకు గైర్హాజరయ్యారు. దీంతో నాకు వైద్యం అందలేదు. ఉన్న నర్సులతో నామమాత్రపు వైద్యం చేయించుకుని ప్రైవేటు వైద్యం కోసం బయటకు వెళ్లాను. పేద ప్రజలకు వైద్యం అందించే వైద్యుల సమస్యలపై ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం కరెక్టు కాదు. -రమణయ్య, గాజులపెళ్లూరు



బుచ్చినాయుడు కండ్రిగలో వైద్యం కోసం వచ్చిన రోగులు



మూతపడి ఉన్న వైద్యుల గది

104 వైద్య సేవలపై ప్రభావం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సమ్మె బాట పట్టడంతో 104 వైద్య సేవలపై ప్రభావం కనిపించింది. పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులు ఉండగా ఒకరు ఆరోగ్య కేంద్రంలో, మరొకరు 104 సంచార వైద్య సేవలు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. సమ్మె కారణంగా వైద్యులు విధులకు రాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో స్థానికంగా అందించే 104 వైద్య సేవలు ఆగిపోయాయి. ఒకటి రెండు ప్రాంతాల్లో మినహా మిగిలిన అన్ని పీహెచ్‌సీల పరిధిలో 104 వైద్య సేవలకు ఆటంకం కలిగింది. ప్రభుత్వం స్పందించి వైద్యుల డిమాండ్లు పరిష్కరిస్తే గానీ పేదలకు వైద్య సేవలు అందే అవకాశం లేదు. సీజన్ వ్యాధులు వ్యాపించే పరిస్థితుల్లో వైద్యులు అందుబాటులో లేవటం లేకపోవడంపై అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తప్పుడు కేసులతో శునకానందం పొందుతున్నారు!

వెంకటగిరి (సైదాపురం): కూటమి నేతలు, తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి, ఇబ్బందులు పెడుతూ శునకానందం పొందుతున్నారని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ నేతలను టార్గెట్ చేయడం పనిగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందులో కొందరి ఆస్తులు అక్రమంగా తీసేసుకోవడంతోపాటు వాహనాలపై సైతం అక్రమ కేసులో బానాయిస్తున్నారని ఆరోపించారు. తప్పు చేసిన ఏ ఒక్క అధికారినీ వదిలిపెట్టేది లేదని అన్నారు. కార్యకర్తలు, నాయకులకు అండగా అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగన్ 2.0 డిజిటల్ బుక్‌ను పద్ధతికి శ్రీకారం చుట్టారని, ఈ మేరకు ఇబ్బందులు పడినా ప్రతి కార్యకర్త ఆ బుక్‌లో వివరాలు నమోదు చేస్తే వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన అనంతరం వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలీసుల వ్యవహార శైలి బాగా లేదని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వివక్షత చూపుతున్నట్లు ఆరోపించారు.



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ఆలస్యంగా రైళ్ల రాకపోకలు

పాకాల: మోటకంపల్లె వద్ద రైలు పట్టాలు తప్పడంతో పలు రైళ్లు ఆలస్యమవుతున్నట్లు ఎస్‌ఐ సుబ్రమణ్యంతెలిపారు. తిరుపతి-రామేశ్వరం, కోయంబత్తూర్-తిరుపతి, మన్నార్‌గుడి, విల్లుపురం-తిరుపతి, పూణే-కన్యాకుమారి,బెంగళూరు-కాకినాడ, కాచిగూడ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయన్నారు.

క్లుప్తంగా

పొలంలో కారు బోల్తా



బోల్తా పడిన కారు

నాగలాపురం: మండలంలోని సుబ్బానాయుడు కండ్రిగ వద్ద ఆదివారం రాత్రి రోడ్డు పక్కన ఉన్న పొలంలో కారు బోల్తా పడింది. పోలీసులు కథనం మేరకు.. తమిళనాడులోని మాధావరానికి చెందిన ఓ కుటుంబం తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరిగి చెన్నైకు వెళుతుండగా మార్గం మధ్యలోని సుబ్బనాయుడు కండ్రిగ వద్ద కుక్క అడ్డంగా రావడంతో కారు అదుపు తప్పి బోల్తా పడినట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు. అదృష్టవశాత్తు ఈ రోడ్డు ప్రమాదంలో ఎవరికి ఎటువంటి హాని కలగలేదని చెప్పారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు.

నగల చోరీ




చోరీ జరిగిన అప్పాజీనాయుడు ఇల్లు



పగులగొట్టిన ఇంటి తలుపులు

పాకాల: ఇంట్లోకి చొరబడి నగలు అపహరించిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి విచ్చింది. పోలీసులు కథనం మేరకు.. మండలంలోని ఓబులశెట్టివారిపల్లికి చెందిన అప్పాజీనాయుడు ఈ నెల 27వ తేదీన కుటుంబ సమేతంగా తిరుమల బ్రహ్మోత్సవాలకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గ్రహించిన గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. తిరుమల యాత్ర ముగించుకుని సోమవారం ఇంటికి తిరిగి వచ్చిన అప్పాజీ నాయుడు కుటుంబ సభ్యులు ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. బీరువాలోని 35 గ్రాముల బంగారు నగలు, 200 గ్రాముల వెండి వస్తువులు చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో పెయింటర్ దుర్మరణం



లోకేష్ మృతదేహం

చంద్రగిరి: విద్యుత్ షాక్‌కు గురై పెయింటర్ మృతి చెందిన ఘటన తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని మంగళం సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి భవానీ నగర్‌కు చెందిన లోకేష్(36) పెయింటింగ్ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రోజూవారీ పనుల్లో భాగంగా మంగళం సమీపంలోని కోళ్లఫారం వద్ద నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో పనుల్లో నిమగ్నమయ్యాడు. పెయింటింగ్ పని చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై కింద పడి కుప్పకూలిపడిపోయాడు. వెంటనే తోటి కూలీలు గమనించి లోకేష్‌ను హుటాహుటిన తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శుభ'కరి' శరణు కోరగా.. శ్రీహరి ఇలను చేరి!



గజవాహనంపై విహరిస్తున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి వారు

హనుమంత, గజవాహనాలపై శ్రీహరి వైభవం

- కన్నుల పండువగా స్నపన తిరుమంజన సేవ
- అలరించిన కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- శ్రీవారిపై భక్తితో సారె సమర్పించిన చంద్రగిరి భక్తులు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన సోమవారం ఉదయం హనుమంత వాహనంపైన, రాత్రి గజవాహనంపైన స్వామివారు పురవీధుల్లో ఊరేగారు. స్వామివారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకున్న భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తుల సారె సమర్పణ

చంద్రగిరి మండలం ఎ.రంగంపేట, కందులవారిపల్లి, చిన్నరామాపురం, రామిరెడ్డిపల్లి, కొటాల, ఐతేపల్లి, అగరాల, ఎం.కొంగరవారిపల్లి, కల్‌రోడ్డుపల్లి, పనబాకం పంచాయతీలకు చెందిన భక్తులు శ్రీవారిపై అపారమైన భక్తితో సారెను తీసుకువచ్చారు. సారె తెచ్చిన భక్తులకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సాదరంగా స్వాగతం పలికి ఆలయంలో దర్శన ఏర్పాట్లు చేయించారు. అలాగే గజవాహనానికి తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లి, మల్లంగుంట, సి.మల్లవరం, గాంధీపురం పంచాయతీలకు చెందిన భక్తులు స్వామివారికి సారె సమర్పించారు. వారికి మోహిత్‌రెడ్డి దగ్గరుండి అల్పాహారం వడ్డించి ప్రతి ఒక్కరికీ స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. హనుమంత, గజ వాహనాల్లో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. దేవతా మూర్తుల కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



హనుమంత వాహన సేవలో పాల్గొన్న చంద్రగిరి మండలానికి చెందిన భక్తులు



సారె తీసుకువచ్చిన భక్తులకు స్వాగతం పలుకుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



గజవాహన సేవకు సారెను సమర్పిస్తున్న తిరుపతి రూరల్ మండలం భక్తులు

ఫైనాన్స్ వేధింపులు తాళలేక యువకుడు బలవన్మరణం



అనిల్(ఫైల్)

దక్కిలి: మండలంలోని నరసనాయుడుపల్లికి చెందిన యలకచర్ల అనిల్ (24) అనే యువకుడు ఫైనాన్స్ కంపెనీ వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కథనం మేరకు.. మృతుడు అనిల్ గూడూరులోని సీఎఫ్‌ఎల్‌అనే ఫైనాన్స్ కంపెనీలో కలెక్షన్ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఆ యువకుడు గూడూరులో పనిచేస్తూ తరుచూ ఇంటికి వచ్చేవాడు. అయితే మృతుడు అనిల్ ఆ ఫైనాన్స్ సంస్థలో కలెక్షన్ ఏజెంట్‌గా వసూళ్లు చేసిన నగదు కంపెనీకి చెల్లించలేదని, ఆ కంపెనీ మేనేజర్ కిరణ్, మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున వేధించేవారు. ఈ క్రమంలో ఈ నెల 23వ తేదీన వారిద్దరూ కలిసి అనిల్ స్వగ్రామం అయిన నరసనాయుడుపల్లికి వచ్చి మందలించారు. కంపెనీకి తాను ఎటువంటి బాకీ లేనని, అనిల్ వారికి చెప్పిన కుటుంబ సభ్యుల సమక్షంలో అవమానించారు. దీంతో మనస్థాపానికి గురైన ఆ యువకుడు పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు చికిత్స నిమిత్తం తొలత రాపూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి తండ్రి యలకచర్ల రమణయ్య ఫిర్యాదు మేరకు దక్కిలి పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ శంకర్ తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



వసంతబాయి, ఐసీడీఎస్ పీడీ

తిరుపతి అర్బన్: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు గడువులోపు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ వసంతబాయి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 7 అంగన్‌వాడీ కార్యకర్తలు, 66 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులను భర్తీ చేయడానికి అక్టోబర్ ఒకటి నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. వారి పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రధానంగా పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని చెప్పారు. ఈ ఏడాది జూలై ఒకటో తేదీకి 21 ఏళ్లు నిండి ఉండాలని, 35 ఏళ్ల లోపు ఉండాలని స్పష్టం చేశారు. స్థానికంగా ఉంటూ వివాహిత అయి ఉండాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో పదో తరగతి పాస్ అయిన వారు లేకుంటే 8వ తరగతి వారు అర్హులుగా ఉంటారని చెప్పారు. అయితే ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో 21 ఏళ్లు నిండిన వారు లేని ఎడల 18 ఏళ్ల నిండిన వారు అర్హులుగా ఉంటారని తెలిపారు.

తల్లికి భారమైన ఆడ శిశువు

- రోడ్డు పక్కనే ప్రసవం
- ఆపై శిశువును ఇసుకలో పూడ్చి పెట్టి పరారైన తల్లి



వరదయ్యపాళెంలో వదిలి వెళ్లిన ఆడ శిశువు

వరదయ్యపాళెం: ఆడ శిశువు ఆ తల్లికి భారమైంది. శిశువుకు జన్మనిచ్చిన క్షణాల్లోనే కర్కశంగా ఇసుకలో పాతిపెట్టి తల్లి పరారైన ఘటన వరదయ్యపాళెం మండలంలో చోటు చేసుకుంది. చెత్త ఊడ్చేందుకు వెళ్లిన పంచాయతీ కార్మికులు ఈ విషయం గుర్తించారు. కార్మికులు పోలీసుల చొరవతో శిశువును ప్రాణాలతో కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ విఫలమయ్యారు. వరదయ్యపాళెం మండల కేంద్రంలోని శ్రీకాళహస్తి–తడ ప్రధాన రోడ్డులోని ఓ ఫ్యాన్సీ స్టోర్ వద్ద సోమవారం తెల్లవారుజామున ఆడ శిశువుకు జన్మనిచ్చిన తల్లి ఏకంగా ఆ శిశువును దుకాణం సమీపంలో ఉన్న ఇసుక కుప్పలో మెడ వరకు పూడ్చి పెట్టి తల భాగాన్ని పైకి వదిలి పరారైంది. చెత్త ఊడ్చేందుకు ఉదయం 6 గంటల సమయంలో వరదయ్యపాళెం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు వెళ్లగా కుక్కలు ఆ శిశువు చేతి వేళ్లను లాగుతుండగా చిన్నపాటి కేకలతో తల్లడిల్లుతున్న శిశువును గుర్తించారు. వెంటనే శిశువును ఇసుక కుప్పల్లోంచి బయటకు తీసి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ మల్లికార్జున ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా వైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చి, సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న శిశువును ప్రాథమిక చికిత్స చేపట్టి అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఆడ శిశువు తుదిశ్వాస విడిచింది. సత్యవేడు సీడీపీఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

బస్సు, స్కూటర్ ఢీ..

– స్కూటరిస్ట్ మృతి



మోహన్ మృతదేహం

పాకాల: బస్సు, స్కూటర్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో స్కూటరిస్ట్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సోమవారం స్థానిక పోలీసుల కథనం మేరకు.. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలో తిరుపతి నుంచి పాకాల వైపు వస్తున్న మదనపల్లి ఆర్టీసీ డిపో బస్సు, తిరుపతి వైపు వెళుతున్న స్కూటర్ రెండూ గాందకి సమీపంలోని సర్వీసు రోడ్డులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తి చంద్రగిరి మండలం రమణప్పగారిపల్లి గ్రామానికి చెందిన నందకుమార్ కుమారుడు మోహన్(35)గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్జీదారుల మొర వినండి!

- గ్రీవెన్స్‌కు 283 అర్జీలు



కలెక్టర్ ఆవరణలో ధర్నా చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: 'ముందుగా అర్జీదారులు ఏం చెబుతున్నారో పూర్తిగా వినడం నేర్చుకోండి.ఆ తర్వాత సమస్యను ఎలా పరిష్కారించడానికి వీలు పడుతుందో వారికి వివరించండి. ఒక వేళ సమస్య పరిష్కారం చేయడానికి వీలులేకుంటే అందుకు కారణాలను స్పష్టంగా వారికి అర్థం అయ్యేరీతిలో తెలియజేయండి. ప్రతి శాఖకు చెందిన అధికారులు ఈ అంశాన్ని పరిగణలో ఉంచుకోవాలి.' అని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 283 అర్జీలు అధికారులు అందుకున్నారు. అందులో రెవెన్యూ సమస్యలపై 172 అర్జీలు ఉన్నాయి. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్సీ, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్, సుధారాణి పాల్గొన్నారు.

ఆశతో వచ్చాం

తన భర్త నవీన్ ఓ పరిశ్రమలో కూలీ పనులకు వెళుతుంటారని, పేద కుటుంబానికి చెందిన తమ కుమారుడు ఆరాధ్య(6) దివ్యాంగుడని, పింఛన్ కోసం వచ్చామని బాలయపల్లె మండలం పెరిమిడి గ్రామానికి చెందిన శారద వాపోయింది. పింఛన్ కోసం తాము సచివాలయంతోపాటు మండల కేంద్రంలోనూ అర్జీలు అందజేసినా పింఛన్ మంజూరు చేయకపోవడంతో కలెక్టర్ ఏమైనా సాయం చేస్తారని ఆశతో వచ్చామని పేర్కొంది.

100శాతం వైకల్యం సర్టిఫికెట్ ఉంది

ఆర్థిక కష్టాలతో బతకడం కష్టంగా మారుతుందని, తమ బిడ్డ నిఖిలేశ్వర్‌కు వందశాతం వైకల్యం సర్టిఫికెట్ ఉన్నా పింఛన్ మంజూరు చేయలేదని రేణిగుంట మండలానికి చెందిన ఏ. స్వాతి ఆవేదన వ్యక్తం చేసింది. వైద్యం కోసం రూపాయి కూడా ఖర్చు పెట్టలేని పేద స్థితిలో ఉన్నామన్నారు. తన కుమారుడికి పింఛన్ ఇప్పిస్తే, ఆ డబ్బులతో వైద్యం చేయిస్తామని చెప్పింది. లేదంటే తమ బతుకు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని విలపించింది.

90 శాతం వికలత్వం ఉంది

పేద కుటుంబానికి చెందిన వాళ్లం. తన బిడ్డ ఆరాధ్యకు మానసిక స్థితి సక్రమంగా లేదని, 90శాతం వైకల్యం ఉందని, ఆ మేరకు సర్టిఫికెట్ ఇచ్చారని, అయినా పింఛన్ ఇవ్వలేదని తిరుపతి అర్బన్ మండలానికి చెందిన మాధవీలత పేర్కొంది. సచివాలయంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాకపోవడంతో కలెక్టరేట్‌కు వచ్చామని తెలిపింది.

వితంతు పింఛన్ ఇవ్వండి

తన భర్త 8 నెలల కిందట మృతి చెందినా తనకు వితంతు పింఛన్ మంజూరు కాక ఇక్కట్లు పడుతున్నాని తిరుపతి అర్బన్ మండలం అబ్బన్నకాలనీకి చెందిన షేక్ అమినాబీ వాపోయింది. తనకు ఏ ఆధారం లేదని, తన భర్త పింఛన్ తీసుకుంటూ మృతి చెందితే ఆ పింఛన్ భార్యకు ఇస్తామని చెప్పారని పేర్కొంది. దాంతో ఆరు వారాలుగా గ్రీవెన్స్‌కు వస్తున్నా ఫలితం లేదని పేర్కొంది.

ఇంటింటా సర్వేలు చెప్పకండి

ఇంటింటా వెళ్లి పదేపదే సర్వేలు చేయమని చెప్పకండి. ప్రతి సర్వేకు ఓటీపీ చెప్పాల్సి ఉంటుంది. ఇంటి యజమాని ఓటీపీలు చెప్పడం లేదు. మాతో వాదిస్తున్నారు. మీకు ఓటీపీలు ఎందుకు చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో వలంటీర్లు చేస్తున్న అన్ని పనులు సచివాలయ ఉద్యోగులకు అప్పగించడం ఏ మాత్రం న్యాయబద్ధంగా లేదని సచివాలయ ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేశారు. గ్రామ,వార్డు సెక్రటేరియేట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వరరావు, ఎంప్లాయిస్ ఫెడరేషన్ తిరుపతి నగర అధ్యక్షుడు విద్యాసాగర్, మహిళా అధ్యక్షురాలు గీత, ఉద్యోగ సంఘం నేతలు అమరావతి, సిద్దార్థ, ఈశ్వర్, మురళి, పుండరీకాక్ష, పూర్ణ, నవీన్,నాగమోహన్, సుధారాణి, లక్ష్మిప్రియ, రత్నమాలిని, రజని పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు తిరగడం నావల్ల కాదు

ఇక కలెక్టరేట్ ఆఫీస్‌కు తిరగడం తన వల్ల కాదని, ఆరు నెలలుగా తన భూమి సమస్య కోసం తిరుగుతూనే ఉన్నానని తొట్టంబేడు మండలం కృష్ణాపురానికి చెందిన సద్దికూటి వీరాస్వామి(79) ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ఓ పూలమాల మెడలో వేసుకుని దీక్షకు కూర్చున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్దాయనకు సర్ది చెప్పారు. గేటు వద్ద నుంచి లోనికి వెళ్లి అధికారులను కలవాలని సూచించారు. అనంతరం ఆయన నేరుగా కలెక్టర్ వెంకటేశ్వర్ వద్దకు చేరుకున్నారు. కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు.

న్యాయం చేయకుంటే సమ్మెబాట పడుతాం

సచివాలయ ఉద్యోగులకు న్యాయం చేయకుంటే సమ్మెబాట పడుతామని సచివాలయ ఉద్యోగసంఘం తిరుపతి నగర అధ్యక్షుడు విద్యాసాగర్ స్పష్టం చేశారు. ఆయన నేతృత్వంలో సోమవారం నగర కమిషనర్ మౌర్యకు సమ్మెకు చెందిన వినతిపత్రంతోపాటు తమ డిమాండ్లను తెలియజేశారు.



తిరుపతి కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

సూళ్లూరుపేట: మున్సిపాలిటీ పరిధిలోని నూకలపాళేనికి ఉత్తరం వైపుగా పొలాల్లో తాటిచెట్టు బరకకు ఉరివేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం పొలాల్లోకి వ్యవసాయం చేసుకోవడానికి వెళ్లిన రైతులు చెట్టుకు వేలాడుతున్న శవాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి 45–50 ఏళ్లలోపు వయస్సు ఉంటుందని, మృతుడి వద్ద ఎలాంటి అనవాళ్లు దొరకలేదని తెలిపారు. ఆకుపచ్చ టవల్‌తో ఉరివేసుకుని మృతి చెందాడని తెలిపారు. బ్లూకలర్ గళ్లు కలిగిన షార్ట్ వేసుకుని ఉన్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బ్రహ్మనాయుడు తెలిపారు.

కుటుంబ కలహాలతో..



ధనంజయ(ఫైల్)

దొరవారిసత్రం: కుటుంబ కలహాల కారణంగా క్షణికావేశంలో ఇట్టగుట్ట ధనంజయ(35) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకోగా సోమవారం వెలుగు చూసింది. ఈ ఘటన కల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కల్లూరు గ్రామానికి చెందిన ధనుంజయ ఆదివారం స్నేహితులతో కలిసి మద్యం సేవించడంతో తన భార్య మందలించింది. దీన్ని మనస్సులో పెట్టుకుని క్షణికావేశంలో ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గుర్తించి కాపాడే ప్రయత్నం చేసేలోపు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పలువురు నాయకులు సోమవారం ధనుంజయ మృతదేహాన్ని సందర్శించి నివాళ్లలర్పించారు.

శిక్షణకు హాజరుకావాల్సిందే



వరలక్ష్మి, డీఈఓ

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మెగా డీఎస్సీకి ఎంపికైన నూతన టీచర్లు తప్పనిసరిగా శిక్షణకు హాజరుకావాల్సిందేనని డీఈవో వరలక్ష్మి చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో డీఎస్సీలో ఎంపికైన నూతన టీచర్లకు అక్టోబర్ 3 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థులు అక్టోబర్ 3 ఉదయం 7 గంటలకు తమకు కేటాయించిన శిక్షణ కేంద్రాల్లో హాజరుకావాలన్నారు. ఎలాంటి మినహాయింపులు ఉండవన్నారు. శిక్షణ రోజుల్లో వంద శాతం హాజరు తప్పనిసరి అని చెప్పారు. ప్రతి అభ్యర్థి లేటెస్ట్ ఆండ్రాయిడ్ ఫోన్, అపాయింట్‌మెంట్ ఆర్డర్‌లను తీసుకురావాలని తెలిపారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎస్వీ ఫార్మసీ (ఆర్వీఎస్ నగర్, చిత్తూరు), ఆర్‌కే పాఠశాల (కట్టమంచి, చిత్తూరు), ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ (చిగురువాడ, తిరుపతి), విశ్వం స్కూల్ (జీవకోన, తిరుపతి), మెడ్జీ స్కూల్ (తిరుపతి), ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల (బైపాస్‌రోడ్డు, గూడూరు)లో శిక్షణ ఉంటుందని డీఈఓ వెల్లడించారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ

రేణిగుంట: తిరుపతి జిల్లాలోని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 2019 సాధారణ ఎన్నికలకు ఉపయోగించిన ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్లను సోమవారం వివిధ పార్టీ నాయకుల సమక్షంలో జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, ఈవీఎం గోడౌన్లను ప్రతి మూడు నెలలకొకసారి జిల్లా ఎన్నికల అధికారిగా తనిఖీ చేస్తామని తెలిపారు. అందులో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ సీల్ ఓపెన్ చేసి, భద్రతా ఏర్పాట్లను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి,రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి,వివిధ రాజకీయ పార్టీ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో విరాళం



కలెక్టర్ చేతుల మీదుగా ఆటో పేపర్లు అందుకుంటున్న సతీష్

తిరుపతి అర్బన్: రేణిగుంట మండలంలోని కరకంబాడీ పంచాయితీలోని చైతన్యపురానికి చెందిన పి.సతీష్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ఆటోను విరాళంగా సోమవారం అందజేశారు. ఆటో డ్రైవర్ సతీష్ పక్షవాతంతో ఇటీవల ఆస్పత్రిపాలయ్యారు. ఈ క్రమంలో వైద్య ఖర్చుల నిమిత్తం పెద్ద మొత్తంలో అప్పులు తీసుకున్నారు. తిరిగి సాధారణ స్థితికి చేరుకున్న అనంతరం ఇటీవల ఆయన కలెక్టర్‌ను కలిశారు. తమకు సాయం చేయాలని కోరారు. దీంతో కలెక్టర్ సూచనల మేరకు డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు రాస్ సంస్థ వారి ఆర్థిక సౌజన్యంతో కొత్త ఆటోను సతీష్‌కు ఇప్పించారు. ఆ మేరకు కలెక్టర్ చేతుల మీదుగా ఆటోను అందజేశారు. రాస్ సంస్థ జనరల్ సెక్రటరీ వెంకటరత్నంను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, పొదుపు సంఘాల సంచాలకులు వి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.